క్లుప్తంగా

ఈ- క్రాప్ నమోదు పూర్తి చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి, ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: ఈ-క్రాప్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ రమాదేవి, ఏఓ స్వాతి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 15కు ఈ-పంట నమోదు కార్యక్రమం పూర్తి కావాల్సి ఉందన్నారు. అనంతరం ఏఎస్ఓ రమాదేవి, డీవైఎస్ఓ సాంబశివుడు పంట కోత ప్రయోగ విధానాన్ని వివరిస్తూ వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కసాపురంలో నేడు హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీల్లో మంగళవారం భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ భద్రాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి ఆలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం




అయూబ్ ఖాన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న అయూబ్ ఖాన్‌ను సోమవారం గుంతకల్లు పట్టణంలోని మార్నింగ్ వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్న విషయం విదితమే. సోమవారం స్థానిక రైల్వే గ్రౌండ్‌లో మార్నింగ్ వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

బీసీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

బుక్కరాయసముద్రం: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర, రాయలసీమ యువజన అధ్యక్షుడు జశ్వంత్, జిల్లా యువజన అధ్యక్షుడు చిట్రా నాగరాజు ఆధ్వర్యంలో శింగనమల నియోజకవర్గ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నరేష్, బీకేఎస్ మండల అధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా మునీంద్ర, ఈసీ మెంబర్లుగా మరో 30 మంది ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు మాట్లాడుతూ బీసీల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విజయ్, ఇమామ్ హుసేన్, బాలక్రిష్ణ, శివ, రుద్రయ్య, మధున ప్రవీణ్, అక్కులప్ప, మారుతి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టండి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడిపత్రి రూరల్: పెన్నానదిలోకి కొత్త బ్రిడ్జి పక్కన పెద్దఎత్తున అక్రమంగా ఇసుకను తీసుకెళుతున్న ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లను నియంత్రించాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్ అంజనేయప్రసాద్‌కు సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో కొత్త బ్రిడ్జి వద్ద గల ప్రదేశాన్ని రజకులు కులవృత్తి చేసుకునేందుకు మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తదితరులు కేటాయించారన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరుగుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి రజకులకు ఇబ్బందిగా మారుతోందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజనేయులు, అబ్రహం, సంజన, రామక్రిష్ణ, ఉమాగౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

కళ్యాణదుర్గం రూరల్: మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను కళ్యాణదుర్గం సెబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ వెంకట్ సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొననున్న వారు ఆధార్‌కార్డు అందజేయడంతోపాటు రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు.



తాడిపత్రి మండలం కోమలి గ్రామంలో యువత సందడి



శింగనమలలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



గుంతకల్లులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

గంగ ఒడికి గౌరీ తనయుడు

- కోలాహలంగా నిమజ్జనం
- ఊరేగింపులో యువత సందడి



గుత్తిలో చంద్ర వంక వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



పెద్దపప్పూరు మండలంలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

సాక్షి నెట్ వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా సాగింది. నిమజ్జనాన్ని పురస్కరించుకుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా వినాయక విగ్రహాలను ఊరేగించారు. ఊరేగింపులో పెద్ద సంఖ్యలో యువకులు, చిన్నపిల్లలు, మహిళలు పాల్గొని డప్పు శబ్దాల మధ్య నృత్యాలు చేశారు. బాణసంచా కాల్చుతూ యువత ఊరేగింపులో సందడి చేశారు. మహిళలు రంగులు చల్లుకుంటూ నృత్యం చేశారు.

తాడిపత్రి మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు 150 విగ్రహాలను ఆలూరు, యర్రగుంటపల్లి, పెన్నానది పరివాహక ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పెద్దపప్పూరు మండలంలోని విగ్రహాలను చీమలవాగుపల్లి సమీపంలోని తాడిపత్రి - గుత్తి ప్రధాన రహదారి పక్కన ఉన్న నీటి కుంటలో నిమజ్జనం చేశారు. డీఎస్పీ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ గౌస్ బాషా నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే యాడికి మండలంలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో సీఐ ఈరన్న, ఏఎస్‌ఐ వెంకటేస్, ఫైర్ హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్ వేములపాడు సర్పంచు ఓంకారమ్మ, తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగూరు మండల వ్యాప్తంగా సోమవారం 140 వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించినట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. అదేవిధంగా గుంతకల్లులో గణేశుడి శోభాయాత్రను తిలకించేందుకు భక్తాదులు పోటెత్తారు. నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే గ్రౌండ్ వద్దనున్న వినాయక దేవాలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత గుంతకల్లులోని వినాయక ఘాట్‌లో వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి జీఎస్‌బీసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీటిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. కాగా వినాయక ఘాట్ వద్ద నీటిలో పాము కలకలం రేపింది. దీంతో గజ ఈతగాళ్లు రాళ్లను విసరడంతో నీటిలో నుండి పక్కనే ఉన్న పొదల్లోకి ఆ పాము వెళ్లింది.అదేవిధంగా గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి వినాయక విగ్రహాలను ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. మండలవ్యాప్తంగా విగ్రహాలను గ్రామ శివారులోని కుంటల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పామిడిలో నిర్వహించిన నిమజ్జనానికి సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శింగనమల మండలంలోని శింగనమల, చిన్నజలాలపురం, గోవిందరాయునిపేట, శివపురం, సీ.బండమీదపల్లి, వెస్ట్ నరసాపురం గ్రామాల్లోని వినాయక విగ్రహాలను శింగనమల చెరువులో నిమజ్జనం చేశారు. మండలంలోని సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, మట్లగొంది, చిన్నమట్లగొంది, సలకంచెరువు, రాచేపల్లి, నాయనవారిపల్లి, నిదనవాడ, తరిమెల, ఆనందరావుపేట, కల్లుమడి, గుమ్మేపల్లి, ఆకులేడు, లోలూరు, పెరవలి, జూలకాల్వ, పి.జలాలపురం, కొరివిపల్లి, ఉల్లికల్లు గ్రామాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. యల్లనూరు మండలంలో నిమజ్జనానికి సీఐ సుబ్రహ్మణ్యం బందోబస్తు ఏర్పాటు చేశారు. పుట్లూరు మండలంలో 84 విగ్రహాలను నిమజ్జనానికి తరలించినట్టు సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలోని విగ్రహాలను చెరువు కట్ట సమీపంలో ఉన్న చిక్కవడియార్ చెరువులో నిమజ్జనం చేశారు. సీఐ కరుణాకర్ బందోబస్తు నిర్వహించారు. అలాగే నార్పల, గార్లదిన్నె మండలాల్లో నిమజ్జనం వైభవంగా నిర్వహించారు.



గుంతకల్లులో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక విగ్రహం



గుంతకల్లులో వినాయక విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం



పెద్దపప్పూరులో నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జనార్దన్‌నాయుడు



యాడికిలో భారీ వినాయకుడిని ట్రాక్టర్‌పై నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



పెద్దవడుగూరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న బీసీ కాలనీ వినాయకుడు



శింగనమలలో రంగులు చల్లుకుంటున్న మహిళలు



యల్లనూరులో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న వినాయకుడు



పామిడిలో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



గుత్తి మండలం గొందిపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



గుత్తిలో అతి పెద్ద వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న ఆర్య వైశ్యులు



పుట్లూరు మండలం కడవకల్లు గ్రామంలో..



బీకేఎస్ మండలం గోవిందపల్లిలో ..



నార్పల మండలం కురుగానపల్లిలో..



గార్లదిన్నెలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక విగ్రహాలు

కార్మికులకు జీతాలు వెంటనే ఇవ్వాలి



గార్లదిన్నె మండలం కల్లూరు పంపు హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు



నార్పల మండలం బి.పప్పూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

గార్లదిన్నె/నార్పల: గార్లదిన్నె మండలంలోని కల్లూరులో సత్యసాయి పంపు హౌస్ వద్ద సోమవారం సత్యసాయి కార్మికులు 19వ రోజు నిరవధిక సమ్మె చేశారు. వారు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగభూషణం, బాషా, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, నాగవర్ధనం, సాంబశివ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నార్పల మండలం బి.పప్పూరు పంప్ హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేశారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీరాములు, చంద్రమోహన్, నరసింహులు, ఈశ్వరయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని

బుక్కరాయసముద్రం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రం డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని సూచించారు. సోమవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు ఆరోగ్యం-ఆహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి నెలా వైద్యుల సూచన మేరకు మందులు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు, నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌రావు, పర్యవేక్ష శ్రీదేవి, శ్రీధర్, కరుణాకర్, వెంకటేష్, రాజేంద్ర, వైద్య సిబ్బంది, గర్భవతుల తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు ప్రారంభం



బేతాపల్లిలో పంటకోత ప్రయోగాలు చేస్తున్న అధికారులు

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. సోమవారం మండలంలోని బేతాపల్లి గ్రామంలో ఏడీఏ వెంకట్రాముడు, ఉప గణాంకాధికారి శ్రీనివాసులునాయక్ తదితరులు రైతు బొగ్గులాలెప్ప వేరుశనగ పొలంలో పంట కోత ప్రయోగాలు చేశారు. ఈ సందర్భంగా మూడు కిలోల దిగుబడి వచ్చినట్లు వారు గుర్తించారు. అనంతరం ఏడీఏ కంది పంట పరిశీలించి చీడపీడల నివారణకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వీఏఏ దయానంద్ సాగర్, రైతులు ధనుంజయ, అల్లావలి, వెంకటరమణయ్య, బ్రహ్మానందరెడ్డి, పుల్లయ్య, శేఖర్, నారాయణ, తిమ్మప్ప, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'ఫిర్యాదుల విభాగం'

యల్లనూరు: సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేశామని తహసీల్దారు నాగరాజు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి పలు సమస్యలపై వినతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ వేలం



యర్రగుంట్లలో వినాయకుడి లడ్డూ వేలం వేసిన దృశ్యం

గార్లదిన్నె: మండల కేంద్రంతో పాటు యర్రగుంట్ల, సంజీవపురం, కల్లూరులో వినాయక చవితికి ఏర్పాటు చేసిన లడ్డూ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రగుంట్లలో పెద్దన్న రూ.11,600, సంజీవపురంలో ప్రకాష్ రూ.35,000, కల్లూరులో బ్రహ్మానంద రెడ్డి రూ.22,000కు లడ్డూ సొంతం చేసుకున్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు





శింగనమల: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని వైఎస్సార్‌సీపీ శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు ధ్వజమెత్తారు. వరదలపై ఆయన సోమవారం స్పందించారు. వరద ప్రభావంపై వాతావరణ శాఖ ముందస్తు సమాచారం అందించినా ప్రభుత్వం సహాయక చర్యలు తీసుకోలేకపోయిందన్నారు. వరదలు ముగిసి మూడు రోజులైనా అధికారం యంత్రాంగం సహాయ చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. వరదల్లో చిక్కుకున్న వారికి తాగునీరు కూడా అందించలేకపోయారన్నారు. కూటమి సర్కార్ నిర్లక్ష్యం వల్ల విజయవాడలో 50 మందికి పైగా అధికారికంగా మృతి చెందారని, జాడ తెలియని వారు చాలామందే ఉన్నారని తెలిపారు. దీనంతటికీ కారణం సీఎం చంద్రబాబు అసమర్థతేనని ఆయన విరుచుకుపడ్డారు. పబ్లిసిటీపై ఉన్న శ్రద్ధ బాధితులను ఆదుకోవడంలో ఉండటం లేదన్నారు. ఉండవల్లి కరకట్ట లోపల సీఎం చంద్రబాబు నివాసం, వేమూరి రాధాకృష్ణ పవర్‌ప్లాంట్ కాపాడేందుకే బుడమేరును మళ్లించి పేద బతుకులపై నీళ్లుచల్లారని దుయ్యబట్టారు. ఇంకా వరద ప్రాంతంలో మామూలు పరిస్థితి రాలేదని, ప్రజలు రోగాలు బారిన పడి ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వరదలు వచ్చి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సాయం అందించడం పోయి, వారి తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. బాధితులు తమ బాధను తెలుపుతున్నా, ఇప్పటివరకూ వారికి కనీసం తిండి, నీరు అందించలేకపోతోందన్నారు. 2020- 2022లో కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్నే వణికించిందని, అంతటి విపత్తులో నాటి సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా నియంత్రణా చర్యలు చేపట్టి.. బాధితులకు వలంటీర్ వ్యవస్థ ద్వారా సహాయక చర్యలు చేపట్టారని ఆయన గుర్తు చేశారు.

14,15న జేవీవీ మహాసభలు



జేవీవీ నాయకులతో కలసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

గుత్తి: అనంతపురంలో ఈ నెల 14,15న జనవిజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర వార్షిక మహాసభలు నిర్వహించనున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో సోమవారం ఆయన జేవీవీ నాయకులతో కలసి ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అతిరథ మహారథులందరూ వార్షిక మహాసభలో పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరూ మహాసభలకు హాజరై జయప్రదం చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లు, కర పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శులు గురుశంకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.